క్లుప్తంగా...

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లో ఈ నెల 20 (నేడు)న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రూ. 74.40 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు కృషి



బస్తీవాసులతో మాట్లాడుతున్న అధికారులు

బౌద్ధనగర్: కుక్కల బారి నుంచి ప్రజలకు రక్షించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. బుధవారం ఆమె వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ సద్గుణ దేవీతో కలిసి డివిజన్‌లోని అంబర్‌నగర్, గొల్లపుల్లయ్యబావి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కుక్కలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత తొందరగా వీధి కుక్కల నియంత్రణకు ప్రయత్నిస్తామన్నారు.

రంజాన్ మాసానికి ఎంతో ప్రాముఖ్యం



సహర్‌లో పాల్గొన్న మన్నె క్రిశాంక్

రసూల్‌పురా: పవిత్ర రంజాన్ మాసంలోని ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. రసూల్‌పురా మజీద్ ఈ–ఇలాహీ వద్ద అబ్దుల్ వాహాబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సహర్‌లో క్రిశాంక్ ముస్లింలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాస దీక్షలు నెల రోజుల పాటు నియమ నిష్టలతో కొనసాగిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. రంజాన్ మాసం ముగిసే వరకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట సీఐ శ్రీనివాస్‌రావు, ఫహీమ్, ఫస్సీ, యూనస్, మోని, రఘు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



రంజాన్ కానుకలను అందజేస్తున్న శ్రీనివాస్

రసూల్‌పురా: రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ కానుకలను రసూల్‌పురాలోని సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్‌ల వద్ద మార్కెట్ మాజీ చైర్మన్ టీఎస్. శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. రసూల్‌పురాలో రెండు వేల కుటుంబాలకు కానుకలను అందజేసినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, బాల్‌రాజ్, సాగర్, నిస్సార్, సందీప్, అలీ, అక్బర్, స్వామి బాబురావు, శ్యామ్ పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

ముషీరాబాద్: విత్తనాల నాణ్యతను మెరుగుపరిచేందుకు రైతుల ఆదాయాన్ని పెంచడానికి విత్తన ఉత్పత్తి, మార్కెటింగ్‌లలో వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిపాలన నియంత్రణలో ఉన్న నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ పని చేస్తుందని ఎస్‌ఎఫ్‌పీసీ డైరెక్టర్ నటాబర్‌పాల్ తెలిపారు. బుధవారం సీజీఓ టవర్స్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాడి రైతులకు, ఎఫ్‌పీఓలకు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌లలో ఉన్న సబ్సిడీలు వాటి వల్ల ఎఫ్‌పిఓలకు చేకూరే లాభాలను పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అశోక్‌కుమార్, సీనియర్ జనరల్ మెనేజర్ కుల్‌దీప్‌సింగ్‌లు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఎఫ్‌పీఓ సంఘాల నుంచి 100 మంది ప్రతినిధులు, పాడి రైతులు హాజరయ్యారు. ప్రోగ్రామ్ ఏరియా మెనేజర్ బి.శరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజినల్ మేనేజర్ ఏ.బ్రిటో, శివకుమార్ తదితరులున్నారు.

రోగి సహాయకులకు ఆశ్రయం

- గాంధీలో అందుబాటులోకి రానున్న షెల్టర్‌హోం
- రూ. 91 లక్షలు కేటాయించిన సీడీఎంఏ
- చివరి దశలో పనులు



గాంధీ ప్రాంగణంలో తుదిదశకు చేరుకున్న షెల్టర్‌హోం నిర్మాణం

గాంధీఆస్పత్రి : రోగి సహాయకులు తలదాచుకునేందుకు గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో అధునాతన వసతులు, సౌకర్యాలతో షెల్టర్‌హోం త్వరలోనే అందుబాటులోకి రానుంది. కమిషనర్ అండ్ డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఆధ్వర్యంలో రూ.91 లక్షల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇతర రాష్ట్రాలు, తెలంగాణ జిల్లాలతోపాటు నగరం నలుమూలల నుంచి ప్రతినిత్యం వేలాది మంది గాంధీ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతుంటారు. రోగితోపాటు సహాయకులుగా ఒకరికి మాత్రమే వార్డులోకి అనుమతి ఉంది. రోగిని డిశ్చార్జీ చేసేంత వరకు మిగిలిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ షెడ్లు, చెట్ల కింద రోజుల తరబడి ఉంటున్నారు. గాంధీ ఇన్‌పేషెంట్ విభాగంలో నిత్యం సుమారు రెండు వేల మంది చికిత్సలు పొందుతుంటారు. ఓపీ విభాగం ఎదురుగా మెడికల్ స్టోర్స్ భవన సమూదాయంపైన రోగి సహాయకుల కోసం మరో అంతస్తు నిర్మించి షెల్టర్‌హోం ఏర్పాటు చేయాలని సీడీఎంఏ నిర్ణయించి నిధులు కేటాయించింది.

అందుబాటులోకి వంద పడకలు..

రోగి సహాయకులు కాలకృత్యాలు తీర్చుకుని, రాత్రి సమయాల్లో నిద్రించేందుకు నిర్మిస్తున్న షెల్టర్ హోంలో మొత్తం వంద పడకలు ఏర్పాటు చేసి స్త్రీ, పురుషులకు కేటాయించనున్నారు. నాలుగు చొప్పున మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు, వసతలు కల్పించారు. మొదటి అంతస్తు టెర్రాస్‌పై రేకుల షెడ్ వేయించి మరికొంతమందికి వసతి కల్పించనున్నారు. మాత, శిశు సంరక్షణ (ఎంసీహెచ్) భవన నిర్మాణ కోసం శివానంద ఆశ్రమం నిర్మించిన షెల్టర్‌హోంను రెండేళ్ల క్రితం కూల్చివేయడంతో రోగి సహాయకులు వసతి సౌకర్యం కోల్పోయారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) పథకం ద్వారా రూ.25 లక్షలతో ఎన్టీపీసీ సంస్థ నిర్మించిన షెడ్‌లోనే రోగి సహాయకులు తలదాచుకుంటున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డుకట్టపడేలా..

అన్నిరకాల వసతులు, సౌకర్యాలతో పాటు మూడు పూటల ఆహారం ఉచితంగా లభించడంతో గాంధీ ప్రాంగణం అసాంఘిక శక్తులకు నిలయంగా మారే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. వందలాది మంది యాచకులు, చిత్తుకాగితాలు ఏరుకునేవారు, చిల్లర దొంగలు, పోకిరిలు ఆస్పత్రి ప్రాంగణాన్ని అడ్డాగా చేసుకుని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. చిలకలగూడ ఠాణా, గాంధీ అవుట్‌పోస్ట్ పోలీసులతోపాటు జీడీఎక్స్ సెక్యూరిటీ సిబ్బంది నిత్యం తనిఖీలు చేపట్టడంతో నేరాలు, దొంగతనాలు కొంతమేర తగ్గాయి. నూతనంగా ఏర్పాటు చేస్తున్న షెల్టర్‌హోం వద్ద తగిన భద్రత ఏర్పాట్లు చేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి పాలనాయంత్రాంగం భావిస్తోంది. ఎండా, వానల నుంచి రోగి సహాయకులకు రక్షించేందుకే షెల్టర్‌హోం నిర్మాణం చేపట్టామని సీడీఎంఏ అధికారులు స్పష్టం చేశారు.

త్వరలోనే అందుబాటులోకి..



వైద్యమంత్రి హరీష్‌రావు ఆదేశాల మేరకు గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. సీడీఎంఏ కేటాయించిన నిధులతో షెల్టర్‌హోం నిర్మిస్తున్నాం. తుదిదశకు చేరుకున్న నిర్మాణ పనులను త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు స్థానిక పోలీసులు, సెక్యూరిటీ సిబ్బందితో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తాం.

–రాజారావు, గాంధీ సూపరింటెండెంట్

దేవాలయాన్ని సందర్శించిన అధికారుల బృందం



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ముషీరాబాద్ చౌరస్తాలోని చరిత్రాత్మక సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని బుధవారం దేవాదాయ శాఖ అధికారులు సందర్శించారు. దేవాలయాన్ని అభివృద్ధి చేయాలనే మంత్రి తలసాని ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు.దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామక్రిష్ణ, ఇంజినీర్ శర్మ, స్థపతి జ్ఞానేశ్వర్, కార్పొరేటర్ హేమలత, ఇన్‌చార్జి పవన్‌కుమార్ గౌడ్, ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప, ఈవో రాజేష్ తదితరులు దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం లోపల, బయట దుకాణాల సముదాయాన్ని పరిశీలించారు. ప్రధాన రహదారిలో ఎంతో చరిత్ర కలిగిన దేవాలయాన్ని అత్యంత అద్భుతంగా నిర్మించడంతో పాటు ప్రాంగణంలో ఉన్న దుకాణాల సముదాయాన్ని పునర్నిర్మాణం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారని అధికారులు తెలిపారు. త్వరలో రెవెన్యూ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వే చేపడుతామన్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాల యజమానులకే నిర్మాణం తర్వాత వారికే కేటాయిస్తామని నిర్మాణాలకు సహకరించాలని పవన్‌కుమార్ గౌడ్ కోరారు. వారి వెంట నాయకులు వెంకట్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, పిట్ల ప్రతాప్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడంలో ఆనందం ఉంటుంది



మితభోజన కార్యక్రమంలో పాల్గొన్న రవీందర్ గౌడ్

సనత్‌నగర్: మండుటెండల్లో రోడ్లపై రాకపోకలు సాగించే బాటసారుల ఆకలి, దప్పికలను తీర్చేందుకు శ్రీనివాస సమాజ సేవ ట్రస్టు అందిస్తున్న సేవలు ఎనలేనివని సరోజిని దేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డా. ఎస్. రవీందర్ గౌడ్ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో బీకే గూడ పార్కు వద్ద కొనసాగుతున్న మధ్యాహ్న మిత భోజన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి పలువురికి భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ పార్థసారధి సారథ్యంలో సేవా భావం కలిగిన వయోధికులంతా కలిసి తమ వంతుగా మండుటెండల్లో బాటసారులకు స్వాంతన చేకూర్చేలా శిబిరాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు. దశాబ్ద కాలానికి పైగా క్రమం తప్పకుండా వేసవి కాలంలో వారు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. బుధవారం నాటి మధ్యాహ్న మితభోజన కార్యక్రమానికి గౌరీశంకర్ రెడ్డి దాతగా వ్యవహరించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సామల హేమ సూచించారు. సాలబస్తీలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, సుమారు రూ. 2 కోట్లతో నిర్మిస్తున్న నామాల గుండు వార్డు కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. నాణ్యతలో రాజీపడే ప్రసక్తి లేదని నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

47 దేశాలలో అంబేడ్కర్ జయంతి



ప్రసంగిస్తున్న బండా ప్రకాష్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రంచంలో 47 దేశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు జరిగాయని శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్య ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధిస్తామనే సంకల్పంతో అంబేడ్కర్ ముందుకు వెళ్లారని పేర్కొన్నారు. అంబేడ్కర్ సేవలను గుర్తించి దేశంలో తొలిసారి ఓయూ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, పూలేతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమరయ్య జయంతులను ఈ నెలలోనే జరుపుకోవడం విషమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ప్రొ.వీవీ బస్వరావు, ప్రొ.రమేష్‌కుమార్, డాక్టర్ పరుశరాములు, కోఆర్డినేటర్లు డా.పరమేశ్వర్, డా.రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముషీరాబాద్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దళిత రత్న అవార్డు పొందిన ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్‌రావు సూచించారు. మహనీయుల జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు పొందిన అవార్డు గ్రహీతలకు బుధవారం రాంనగర్‌లోని దావత్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ, అభినందన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎన్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నూతనంగా నిర్మిస్తున్న సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టారన్నారు. 125 అడుగుల నిలువెత్తు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తనకు మించిన అంబేడ్కర్ అభిమాని మరొకరు లేరని సీఎం కేసీఆర్ నిరూపించుకున్నారన్నారు. దళితుల సంక్షేమం కోసం దళితబంధు, ఇతర సంక్షేమ పథకాలను అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



పైప్‌లైను పనులను పరిశీలిస్తున్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: రసూల్‌పురాలో జైకా సివరేజీ లైన్ పూడికతీత పనులు ఎట్టకేలకు బుధవారం ప్రారంభమయ్యాయి. పూడికతీత కారణంగా మురుగు నీరు సాఫీగా పారకుండా మ్యాన్‌హోళ్ల ద్వారా బస్తీ రోడ్లపైకి చేరుతుండటంతో గతంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి ఫిర్యాదు మేరకు సీఈవో మధుకర్‌నాయక్ పర్యటించి సమస్యను పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినా అధికారుల్లో చలనం లేకపోయింది. పలుమార్లు కేశవరెడ్డి సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి మురుగునీటితో పాటు వరద రోడ్లపైకి చేరుతుండడంతో శానిటేషన్ విభాగం అధికారులు పూడికతీత పనులను ప్రారంభించారు. బుధవారం కేశవరెడ్డి పనులను పర్యవేక్షించి మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పూడికతీతతో మురుగునీరు సాఫీగా నాలాలోకి వెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. రెండవ వార్డు గుండా కొనసాగుతున్న ప్రధానా ఓపెన్ నాలాలోనూ పూడికతీత పనులు ప్రారంభించాలని సీఈవో, శానిటేషన్ విభాగం అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్, మణికంఠ, జబ్బార్, శానిటేషన్ విభాగం అధికారులు అఫ్జల్, చౌహాన్, దాఫేదార్ సూరి, దొబ్బ శ్రీను, చిన్నం పాండు పాల్గొన్నారు.

భార్యను వేధించినందుకు 210 రోజుల జైలు



రాజేష్

అడ్డగుట్ట: భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తకు 210 రోజుల జైలు శిక్ష విధించిన ఘటన తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం .. అడ్డగుట్టకు చెందిన రాజేష్(40) మద్యానికి బానిసై రోజు మద్యం తాగి భార్య అంబికతో గొడవ పడుతూ వేధింపులకు గురి చేస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఆమె భర్త రాజేష్‌పై స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం అతన్ని 15 స్పెషల్ ఎంఎం మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 210 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 1,100 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కులగణనకు అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

కాచిగూడ: జనగణనలో కులగణనకు కేంద్ర ప్రభుత్వంపై దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒత్తిడి తీసుకురావాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కోరారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 70 కోట్ల మంది బీసీలు, ప్రధాన రాజకీయ పార్టీలు కులగణనను డిమాండ్ చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదన్నారు. కులాల వారీగా జనాభా లెక్కలు ఉంటేనే రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు సాధ్యమవుతుందన్నారు.

పేదల కోసం హృదయ నేస్తం



వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

లాలాపేట: ఇళ్లలో వాడని వస్తువులను నిరుపేదలకు అందించేందుకు హైదరాబాద్ హృదయ నేస్తం (వాల్ ఆఫ్ కైండ్‌నెస్) తార్నాకలోని ఆర్టీసీ బస్ షెల్టర్ వద్ద ఏర్పాటు చేసినట్లు నవభారత నిర్మాణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ తెలిపారు. యూకేలో మాస్టర్ ఇన్ లా చదువుతున్న గాలి పరివర్తన, హైదరాబాద్‌లో బీబీఏ చదువుతున్న గాలి వినూత్నల చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించి పలువురు పేదలకు దుస్తులు, చెప్పులు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. పే బ్యాక్ టు సొసైటీ అనే నినాదాన్ని ఇచ్చిన డా. అంబేడ్కర్ స్ఫూర్తితో నగరంలోని పేద ప్రజల కోసం హైదరాబాద్ హృదయ నేస్తంను తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇంట్లో ఏవైనా వాడని దుస్తులు, చెప్పులు, నిత్యావసర వస్తువులు ఉంటే హృదయ నేస్తం కేంద్రంలో అందించాలని సూచిస్తున్నారు. దీని ద్వారా సేకరించిన వాటిని నవభారత నిర్మాణ చారిటబుల్ ట్రస్టు ద్వారా అవసరమైన పేద ప్రజలకు అందిస్తామని సహాయం చేయాలనుకుంటే 9390119889 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాధి గాలి చంద్రకళ, నిర్మల పరపతి సంఘం అధ్యక్షురాలు నిర్మల, ఓయూ మోడల్ స్కూల్ టీచర్లు జన్ను భిక్షపతి, జాంగీర్, ఓయూ స్కాలర్‌లు శ్రీనివాస్, డా. శివ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మించే వరకూ పోరాడుతాం



దీక్షలో పాల్గొన్న మహిళలు

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారంతో 15వ రోజుకు చేరుకుంది. దీక్షలో స్లమ్ లెవల్ ఫెడరేషన్ మహిళలు, ఆర్పీలు సులోచన, మాధవి, లలిత, లక్ష్మీ, యాదమ్మ, గంగ పాల్గొని మాట్లాడారు. సినిమా హాళ్లు, పెట్రోల్ బంక్‌లు కాదు ప్రజలకు కనీసం వైద్యం అందించే ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. సాయంత్రం నాయకులు ఆలకుంట హరి, నర్సింహ, బోదాసు నర్సింహలు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో గండికోట విజయ్‌కుమార్, ఆలకుంట లింగయ్య, ప్రభాకర్, ముత్యాలు, కిట్టు, నర్సింహ్మ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

- 25న సనత్‌నగర్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25వ తేదీన సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీలోని ఎస్‌వీబీటీ ఆడిటోరియంలో జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతంగా నిర్వహించటం పట్ల ఆయా డివిజన్లకు చెందిన నాయకులను అభినందించారు. డివిజన్‌లలో ప్రధాన ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీ జెండాల దిమ్మెల నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనానికి అన్ని డివిజన్ల నుంచి నాయకులు హాజరు కావాలన్నారు. నియోజకవర్గంలో ఎవరూ ఊహించని విధంగా వందల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, ఇంకా కొన్ని పనులు మంజూరయ్యాయని త్వరలోనే అవి కూడా ప్రారంభం అవుతాయన్నారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని తనదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ దేవాలయాల కమిటీల నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్లు జారీ చేస్తుందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు ఎన్. శేషుకుమారి, అరుణాగౌడ్, డివిజన్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పవన్ కుమార్, హనుమంతరావు, వెంకటేష్, రాజు, నాయకులు అశోక్ యాదవ్, నాగులు, జయరాజ్, ఖలీల్ బేగ్, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, ప్రేమ్, సరాఫ్ సంతోష్, సురేందర్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం బడుల్లో నాణ్యమైన విద్య..

బన్సీలాల్‌పేట్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బడిబాట ప్రచార కరపత్రాన్ని బుధవారం ఆయన ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, తల్లిదండ్రులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయని, ఉచితంగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా కార్పొరేట్ స్థాయి విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల సాధన సమితి కన్వీనర్లు బి. నర్సింగ్‌రావు, ఆర్. రాజు, పుల్లారావు, స్వరూప, లక్ష్మీ, రవీందర్, భాస్కర్, రాజు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

మంత్రికి వినతి

లాలాపేట: గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సంఘం నాయకులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా గొర్రెలు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు వైద్యులతో అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలను ఏర్పాటు, శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలల పునరుద్ధరనకు చర్యలు, దీంతో పాటుగా మంచిర్యాల జిల్లాలోని బీరన్న దేవాలయానికి నిధులు మంజూరు చేయాలనీ కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తలసాని ప్రభుత్వంతో మాట్లాడి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాంచందర్ యాదవ్, రాజన్న, గట్టు మహేశ్‌యాదవ్, రాజశేఖర్, పోచన్న, తిరుపతి, గట్టయ్య యాదవ్, కాల్వ రమేష్, మహేశ్ యాదవ్, సందీప్ ఉన్నారు.

కమీషన్ల కోసమే అధునాతన విద్యా భవనాల నిర్మాణం

ఎస్‌డీఎఫ్ కన్వీనర్ మురళి



కూల్చివేసిన భవనాన్ని పరిశీలిస్తున్న ఆకునూరి మురళి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని కూల్చి బహుళ అంతస్తుల భవన సముదాయ నిర్మాణం పనులు కేవలం కమీషన్ల కోసమే చేపడుతున్నట్టు స్పష్టమవుతోందని సోషల్ డెమోక్రెటిక్ ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆరోపించారు. బుధవారం సేవ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఎస్‌డీఎఫ్ కో కన్వీనర్ డాక్టర్ పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన కూల్చివేసిన పాఠశాల భవనాన్ని సందర్శించి మాట్లాడారు. అధునాతన భవన నిర్మాణం పేరుతో పటిష్టంగా ఉన్న పాఠశాల భవనంలోని 27 గదులను కూల్చివేయించారని మరమ్మతు పనులు, అదనపు గదుల నిర్మాణంతో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మాణం పనులు పూర్తిచేసి విద్యా అవసరాలను తీర్చే అవకాశం ఉన్నప్పటికీ కమీషన్ల కక్కుర్తి కోసమే స్థానిక ఎమ్మెల్యే అధునాతన భవన నిర్మాణం పేరిట రూ.29 కోట్లు మంజూరు చేయించున్నారన్నారు. టెండర్లు పిలవకుండ, కాంట్రాక్టరు ఎంపిక జరుగకుండా పాఠశాల భవనాల కూల్చివేతల పనులు ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. కనీసం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి కూడా సమాచారం ఇవ్వకుండా భవనాల కూల్చివేత పనులు ప్రారంభించడం వెనుక ఎమ్మెల్యే తన మనుషులతో కొత్త భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు పథకం రూపొందిస్తున్నట్టు అర్థమవుతుందన్నారు. విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపకుండా పటిష్టమైన భవనాలను నేలమట్టం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అప్రకటితంగా గదులను నేలమట్టం చేస్తుండడంతో ప్రయోగశాల, లైబ్రరీ, అల్మారాలు, అందులోని రికార్డులకు భద్రత కరువైందన్నారు.